సమస్యల పరిష్కారానికి కృషి



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు శ్రీరాంనగర్‌ కాలనీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మణికొండ మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కె. నరేందర్‌ ముదిరాజ్‌ అన్నారు. ఇటీవల ఏర్పాటైన నూతన కార్యవర్గం అధ్యక్షుడు కె. సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్‌. రామకృష్ణల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న మాజీ చైర్మన్‌ మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా ఉన్న పందెన్‌వాగు సమస్య పరిష్కారానికి ఇప్పటికే మున్సిపల్‌ అధికారులు టెండర్‌ పిలిచారని, త్వరలోనే పరిష్కారం అవుతందన్నారు.

పేద ప్రజలను ఇబ్బందిపెట్టడం తగదు



రాయదుర్గం: గౌలిదొడ్డిలోని బసవతారకనగర్‌లో ఆదివారం సీపీఎం నాయకులు పర్యటించారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు జగదీష్‌, శేరిలింగంపల్లి నాయకుడు కొంగరి కృష్ణ మాట్లాడుతూ 30 ఏళ్ళుగా గుడిసెలు వేసుకొని ఉంటున్న పేద ప్రజలను ఇబ్బందిపెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో కులవివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌, సత్యనారాయణరాజు, అంతయ్య, శ్రీనివాస్‌ స్థానికులు పాల్గొన్నారు.

అలకాపూర్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు



మణికొండ: అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్‌ నంబర్‌ 13లోని శ్రీ సీతారామచంద్ర అభయాంజనేయస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, సేవా కాలం, సాత్తుమొర, నిత్యారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, శాంతి పాఠం, వేదవిన్నపాలు, మూల మంత్ర, హవనములు, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరణ, నివేదన, మంగళశాసనము నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు.

అమ్మవారికి తొట్టెల సమర్పణ



తొట్టెలకు పూజలు చేసిన నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: గోల్కొండ జగదాంబిక అమ్మవారికి మణికొండ క్వార్టర్స్‌ వాసులు ఆదివారం తొట్టెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ దేవాలయం వద్ద తొట్టెలకు పూజలు నిర్వహించి, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా గోల్కొండకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ రామకృష్ణారెడ్డి, బీజేపీ మున్సిపల్‌ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డితో పాటు బీజేపీ, కాంగ్రెస్‌ నాయకులు తొట్టెలకు పూజలు చేశారు.

షర్బత్‌ పంపిణీ



ఆదర్శనగర్‌లో షర్బత్‌ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌

శేరిలింగంపల్లి: మొహర్రం పండుగను పురస్కరించుకొని శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లో ఆదివారం షర్బత్‌ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే పండుగ మొహర్రం అన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, అబ్దుల్‌ ఘనీ, రమేష్‌, ముసలయ్య, ఖాజా, జగదీష్‌, గండయ్య, రాములు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: జీఎంఆర్‌ యువసేన నాయకులు షకీల్‌ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు బస్టాండ్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన షర్బత్‌ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, సీనియర్‌ నాయకులు గూడెం మధుసూదన్‌ రెడ్డి, అఫ్జల్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

ముంచుకొస్తోంది ‘వరద’ ముప్పు

ఇంకా పూర్తి కాని వరదనీటి కాల్వ పనులు



మియాపూర్‌: అభివృద్ధి పనుల్లో జాప్యం... ప్రజలపాలిట శాపంగా మారుతోంది. నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాల్సిన పనులు అధికారుల పర్యవేక్షణాలోపంతో నెలల తరబడి కొనసాగుతున్నాయి. వరదనీటి కాల్వ పనులు నత్తనడకన సాగుతుండడంతో వర్షాలు కురిసినపుడు ఇళ్లలోకి వరద నీరు చేరే అవకాశముందని కాలనీలవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇక రోడ్డు తవ్వకాలతో రాకపోకలకు స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

- మియాపూర్‌లోని హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు రోడ్డులో రూ.కోటి90 లక్షలతో వరదనీటి కాలువ పనులు చేపట్టారు. నెలన్నర కిందట ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తికాలేదు.



రోడ్డుపై మట్టి కుప్పలు

- వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో పనులు చేపట్టడం.. కాల్వ పనుల కోసం తవ్విన మట్టిని రోడ్డుపై కుప్పలుగా పోశారు. దీంతో ఆ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు, స్థానిక ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.
- ఈ రోడ్డు వెంబడి నిజాంపేట్‌కు ఎక్కువగా రాకపోకలు చేస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళలో పాఠశాల బస్సులు ఎక్కువగా వెళ్తుంటాయి. అదేసమయంలో ఉద్యోగులు, ఇతర పనులపై వెళ్లేవారు కూడా వస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌ జామ్‌ అవుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- వరదనీటి కాలువ పనుల సందర్భంగా సమీపంలోని డోవా కాలనీ నుండి వచ్చే డ్రైనేజీ పైపులైన్‌లు పగిలి డ్రైనేజీ రోడ్లపై పారుతోంది.
- డోవా కాలనీ లోతట్టుగా ఉండడంతో డ్రైనేజీ నీరంతా రోడ్లపై నిలిచి చెరువును తలపిస్తుంది. భారీ వర్షాలు కురిస్తే వరదనీరు ఇళ్లలోకి వచ్చే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు.
- వర్షాకాలం భారీ వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో వరదనీటి కాల్వ పనులను వేగవంతం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.
- దుకాణాలు, ఇళ్లముందు వరదనీటి కాల్వ పనుల కోసం తవ్వడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వరదనీటి కాల్వ పనుల్లో వేగం పెంచాలని, వర్షాలు పడినప్పుడు కాలనీలో వరదనీరు సాఫీగా వెళ్లిపోయేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.





మియాపూర్‌ హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డులో వరదనీటి కాల్వ పనుల్లో భాగంగా రోడ్డును తవ్విన దృశ్యం



ట్రాఫిక్‌ జామ్‌

వ్యక్తి అదృశ్యం



రమేష్‌ గౌడ్‌ (ఫైల్‌)

మియాపూర్‌ : వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌ ఆర్‌బీఆర్‌ కాంప్లెక్స్‌లోని హాస్టల్‌లో నివాసముంటున్న పొన్నం రమేష్‌ గౌడ్‌(30) సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం 11 గంటల సమయంలో కాగజ్‌నగర్‌ వెళ్తున్నానని స్నేహితుడితో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి వెళ్లకపోవడం, హాస్టల్‌కు రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలుచోట్ల విచారించినా ఫలితం లేకపోవడంతో సోదరి రమాదేవి మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అలరించిన కీర్తనలు

మాదాపూర్‌: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌ శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం వివిఎస్‌ఎం మూర్తి ద్విభాష్యం శిష్యబృందం జిష్ణు, అలేఖ్య, సహస్ర, ప్రజానా, స్వరణ్‌, అనంత్‌ప్రేమ్‌ సాయి, జోవిక, రామ్‌వరుణ్‌, శ్రీచరణ్‌, స్నేహ, శాన్విలాస్య, అక్షర, రామ్‌తరుణ్‌, రామ్‌అరుణ్‌లు అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు ఆలపించారు. సునయన ప్రభ ద్విభాష్యం భరతనాట్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, అన్నమాచార్య కీర్తన, తిల్లాన, భాగ్యలక్ష్మి తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఇందిరా ప్రేమ పాల్గొని కళాకారులను సత్కరించారు.





భళా.. హస్తకళా

ఆకట్టుకుంటున్న మ్యూజియం

మాదాపూర్‌: హస్త కళాకారులు తయారు చేసిన కళాకృతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం సందర్శకులను కట్టిపడేస్తుంది. మ్యూజియంలో వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో సందర్శించ వచ్చు.

- రంగురంగుల ఏటికొప్పాక లాక్కర్‌ బొమ్మలు
- విజయనగరం బొబ్బిలి వీణలు , జాక్‌వుడ్‌తో తయారు చేసిన తంబూరాలు
- నిమ్మలకుంట తోలుబొమ్మలు.. మేక చర్మంతో చేసిన తోలుబొమ్మ ఆకర్షణగా నిలుస్తున్నాయి
- టెర్రకోట మట్టి శిల్పాలు.. గిరిజనులు ఎర్రచందనంతో చెక్కిన రాజురాణి బొమ్మలు.
- తిరుపతి రాతి శిల్పాలు.. శ్రీకాళహస్తి చెక్కబొమ్మలు .. కలంకారి దుస్తులు, తాటాకు కళాకృతులు ఉన్నాయి

బిద్రి కళా వస్తువులు

- కర్ణాటకలోని బీదర్‌ ప్రాంతానికి ప్రత్యేకమైన ధాతువులతో తయారు చేసిన కళాకృతులు
- శ్రీకాకుళంకి చెందిన కళాకారులు తయారుచేసిన జ్యూట్‌ బుట్టలు, బాస్కెట్‌లు, బ్యాగులు

ఉచిత శిక్షణ

శిల్పారామం హస్తకళా మ్యూజియంలో శని, ఆదివారాలలో రిచ్‌ మండల్‌ పెయింటింగ్స్‌, లిప్పన్‌ ఆర్ట్‌, మిర్రర్‌ ఆర్ట్‌, నిర్మల్‌ పెయింటింగ్‌లను మధ్యాహ్నం 1.30 నుంచి సాయత్రం 6 గంటల వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాకారులు జ్ఞానేశ్వర్‌ తెలిపారు. మరిన్ని వివరాలకు 9291206584లలో సంప్రదించవచ్చు. మండల పెయింటింగ్‌ సాయంత్రం 4గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు కళాకారులు మైత్రేయి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963467064లలో సంప్రదించగలరు.







మాదాపూర్‌ శిల్పారామంలోని హస్తకళా మ్యూజియంలో ఆకట్టుకుంటున్న కళాకృతులు



బొబ్బిలి వీణ











అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ



రాయదుర్గం: థాయాలాండ్‌లోని చాయాంగ మైలో జరిగిన 70 అంతర్జాతీయ సదస్సు పబ్లిక్‌ పాలసీ(ఐసీపీపీ7)లో హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి కిరణ్‌కుమార్‌ పత్రసమర్పణ చేశారు. ఆయన ప్రొఫెసర్‌ అరుణ్‌కుమార్‌ పట్నాయక్‌ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ సదస్సులో 70 దేశాల నుంచి 1,050 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మియాపూర్‌ ఎస్‌హెచ్‌ఓగా శివప్రసాద్‌



మియాపూర్‌: మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ నూతన ఎస్‌హెచ్‌ఓగా పి.శివప్రసాద్‌ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్‌ తెలిపారు.

వేణుగోపాలస్వామికి పుష్పాభిషేకం



మణికొండ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాలలో భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చనలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుప్పాలగూడ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, పంచవటి కాలనీ రామాలయం, నార్సింగి శ్రీ వేంకటేశ్వరస్వామి, మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడా సామగ్రి అందజేత



అల్విన్‌కాలనీ: ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు ఆదివారం జనంపల్లి పురేందర్‌ రెడ్డి ఆధ్వర్యంలో రామకృష్ణ వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యనారాయణ, శ్రీధర్‌, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, ప్రసాద్‌, యూత్‌ కమిటీ సభ్యులు భార్గవ్‌, రిత్విక్‌, సాయి, కళ్యాణ్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మైత్రీనగర్‌ నూతన కార్యవర్గం



చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని మైత్రీనగర్‌ ఫేజ్‌ -2 కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం మైత్రీనగర్‌ ఫేజ్‌ -2 కాలనీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గం ఆయనను కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైత్రీనగర్‌ ఫేజ్‌ 2 కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ చీఫ్‌ అడ్వైజర్లు చెన్నారెడ్డి, సుబ్రహ్మణేశ్వర్‌ రావు, విజయ్‌ భాస్కర్‌రెడ్డి, వీరేందర్‌ చౌదరి, మురళీ కృష్ణ, ప్రెసిడెంట్‌ శ్రీనివాసులు రెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌ సురేంద్రబాబు, రఘుమోహన్‌, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌ కుమార్‌, సంయుక్త కార్యదర్శి వెంకట్‌ పవన్‌కుమార్‌, రాంకుమార్‌, ట్రెజరర్‌ ధీరజ్‌ కుమార్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీలు భాస్కర్‌రెడ్డి, కళ్యాణ్‌ కుమార్‌, ఎగ్జిక్యూటివ్‌ కమిటి సభ్యులు సంతోష్‌ కుమార్‌, రాజేష్‌ కుమార్‌, హనుమాన్‌ చౌదరి, నటరాజ్‌కుమార్‌ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యులు

పటాన్‌చెరు టౌన్‌: పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాసు అన్నారు. జూనోసిస్‌ డే ను పురస్కరించుకొని ఆదివారం పటాన్‌చెరు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్‌ టీకాలు వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ...జూనోసిస్‌ అనగా జంతువుల నుండి మనుషులకు సోకే వ్యాధి అని తెలిపారు. మూగజీవాల పెంపకంలో పోషకులు అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.97 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది మల్లేశం, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీ సేవలు ఎనలేనివి



చందానగర్‌ : భారతీయ జనసంఘ్‌ వ్యవస్థాపకులు, విశిష్ట విద్యావేత్త, ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు డాక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ జయంతిని హఫీజ్‌పేట్‌ డివిజన్‌ హుడా కాలనీలో బీజేపీ అధ్యక్షులు జితేందర్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖర్జీ సేవలు ఎనలేనివన్నారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌ రాఘవేంద్రరావు, జిల్లా అధికార ప్రతినిధి అజిత్‌ సేనాపతి, మాజీ కౌన్సిలర్‌ రమణయ్య, నాయకులు సత్యనారాయణ రాజు, డివిజన్‌ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రాజు, రామ్‌రెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన బాస్కెట్‌బాల్‌ పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన ఫ్యూచర్‌ కిడ్స్‌ క్రీడాకారులు

మణికొండ: అలకాపూర్‌ టౌన్‌షిప్‌ నేతాజీ పార్క్‌లో శనివారం ప్రారంభమైన సీఐఎస్‌సీఈ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల జోనల్‌ స్థాయి బాస్కెట్‌బాల్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫ్యూచర్‌ కిడ్స్‌ స్కూల్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో శనివారం బాలికల అండర్‌ -14, అండర్‌ -16, అండర్‌- 17 విభాగాలలో మొత్తం 14జట్లు పోటీ పడ్డాయి. వీటిల్లో అండర్‌- 14, అండర్‌ -16, అండర్‌ -17 విభాగాలలో ఫ్యూచర్‌ కిడ్స్‌ స్కూల్‌ విజేతగా నిలవగా రెండవ స్థానంలో నాసర్‌ బాలికల పాఠశాల, మూడవ స్థానం సుజాత స్కూల్‌ బాలికలు నిలిచారు. ఆదివారం జరిగిన పోటీలలో మొత్తం 15 జట్లు పాల్గొనగా అన్ని విభాగాలలో మొదటి స్థానంలో ఫ్యూచర్‌ కిడ్స్‌ స్కూల్‌ విజేతగా నిలువగా రెండవ స్థానంలో నాసర్‌, మూడవ స్థానంలో సుజాత స్కూల్‌ నిలిచాయి.

బండారు దత్తాత్రేయను స్ఫూర్తిగా తీసుకోవాలి



పుస్తకాలు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్‌

గచ్చిబౌలి: హర్యానా గవర్నర్‌ బండారు దత్తాత్రేయను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్‌ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో బండారు దత్తాత్రేయ రచించిన ‘ప్రజల కథే నా ఆత్మకథ’ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ దత్తాత్రేయ జీవితంతో ముడిపడి ఉన్న రాజకీయ, సామాజిక పరిణామాలు, వ్యక్తిగత జీవిత చరిత్రను పుస్తకంలో రాశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగులుగౌడ్‌, ఆంజనేయులు సాగర్‌, ఎల్లేష్‌, వెంకటస్వామిరెడ్డి, నర్సింగ్‌ యాదవ్‌, గణేష్‌, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.



చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌, మియాపూర్‌లోని పలు కాలనీలలో హైడ్రా మాన్సూన్‌ ఎమర్జెన్సీ టీమ్‌ సిబ్బంది నాలాల శుభ్రం.. చెత్తచెదారంను తొలగించారు. వరదనీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.
– మియాపూర్‌



వీడ్కోలు సన్మానం

మియాపూర్‌ : మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌ఓ క్రాంతికుమార్‌ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌ సిబ్బంది క్రాంతికుమార్‌కు శాలువా కప్పి సన్మానించి వీడ్కోలు పలికారు. క్రాంతికుమార్‌ బదిలీపై సీసీఆర్‌బీ సైబరాబాద్‌కు వెళ్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చంద్రయ్య, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

మియాపూర్‌ : ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన రోహిత్‌ బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి మియాపూర్‌ న్యూ హఫీజ్‌పేట్‌ ప్రేమ్‌నగర్‌ స్నేహితులు టోని సర్కార్‌, అభిజిత్‌ మండల్‌, హేమంత్‌లతో కలిసి ఉంటున్నాడు. స్థానికంగా ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరోగ్యం బాగాలేదని ఉద్యోగానికి రాలేనని శనివారం రోహిత్‌ స్నేహితులకు చెప్పడంతో వారు ముగ్గురు ఉద్యోగానికి వెళ్లిపోయారు. మరుసటి రోజు అర్ధరాత్రి 1.50 గంటల సమయంలో స్నేహితులు రూమ్‌కు వచ్చి చూడగా రూమ్‌ తలుపులు గడియపెట్టి ఉన్నాయి. రోహిత్‌ను ఎంతపిలిచినా పలకకపోవడంతో కిటికీలో నుండి చూడగా రూమ్‌ పైకప్పుకు టవల్‌తో ఉరివేసుకుని కనిపించాడు. తలుపులు బద్దలు కొట్టి లోపటికి వెళ్లి చూడగా రోహిత్‌ అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీంతో మియాపూర్‌ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.